ఎన్నికలకు సహకరించాలి

ఆఫీస్‌లో రాజకీయ నాయకులతో సమావేశమైన ఆర్డీవో వెంకట్‌రెడ్డి

బండ్లగూడ, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆర్టీఓ.. వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో నాయకులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డి, తాసీల్దార్ రాములును సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్, ధనుంజయ్, మహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సట్టా జూదం.. వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 21 : రహ్మత్‌నగర్‌లోని ఓ ఇంట్లో సట్టా జూదం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. రహ్మత్ నగర్‌లో మాల్‌గొండ నీలకంఠ అనే పండ్ల వ్యాపారి తన ఇంట్లో సట్టా జూదం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి ఆ ఇంటిపై దాడిచేసి నీలకంఠను అరెస్టు చేశారు.

నేడే మణికొండ మున్సిపాలిటీ అవిశ్వాసం

- మొత్తం 20 మంది కౌన్సిలర్లు.. అసమ్మతివైపు 12మంది .. చైర్మన్ వైపు 8 మంది ..
- గోవాలో పోటాపోటీ క్యాంపు రాజకీయాలు
- అవిశ్వాసంపై ఎవరి ధీమా వారిదీ..
- మరికొన్ని గంటల్లో తేలనున్న చైర్మన్ భవితవ్యం...

మణికొండ, ఫిబ్రవరి 21 : మణికొండ మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు నేడు తేలనున్నది. మూడు వారాలుగా క్యాంపు రాజకీయాలతో ఉత్కంఠత కొనసాగుతున్న అవిశ్వాసానికి సమయం ఆసన్నమైయింది. మరికొన్ని గంటల్లో బలబలాలు తేటతెల్లం కానున్నది. మొత్తం 20 మంది కౌన్సిలర్లకుగాను అందులో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, ఒక్క ఇండిపెండెంట్ కౌన్సిలర్‌తో కలిసి 12మంది మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌పై అవిశ్వాసం పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో నేడు బలనిరూపనకు అధికారులు ఆహ్వానం పలికారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ బుధవారం పూర్తి చేసినట్లు వెల్లడించారు. నాలుగు సంవత్సరాల పదవీకాలం ముగియనున్న సమయంలో అవిశ్వాసానికి వన్‌థర్డ్ మెజార్టీ నిరూపించుకోవాల్సి ఉండగా.. 13 మంది కౌన్సిలర్లు ఏకపక్షంగా చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటువేస్తేనే చైర్మన్ పదవిని కోల్పోవలసి వస్తుంది. ఇప్పటికే 12 మంది కౌన్సిలర్లు ఏకపక్షంగా ఉండటంతో మరొక్క కౌన్సిలర్ ఎవరూ మద్దతు కూడగడతారన్నది అంతుపట్టడం లేదు. మిగిలిన 8 మంది కౌన్సిలర్లు (చైర్మన్‌తో కలిసి) అంతా మరో క్యాంపునకు తరలివెళ్లారు. ఆక్యాంపులో నుంచి ఎవరు చైర్మన్ కస్తూరి నరేందర్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తారనేది తెలియాల్సి ఉంది. అసమ్మతి కౌన్సిలర్లంతా ఖచ్చితంగా తాము అవిశ్వాసాన్ని నెగ్గి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గోవాలో క్యాంపు రాజకీయాలు..

మణికొండ నుంచి 12మంది కౌన్సిలర్లు వారం రోజుల క్రితం గోవాకు వెళ్లి.. రోజుకో హోటల్ తిరుగుతూ క్యాంపు రాజకీయాలను కొనసాగిస్తుండగా.. వారికి పోటీగా గోవాలోనే చైర్మన్ నరేందర్ 8 మంది కలిసి పోటాపోటీ క్యాంపులను నిర్వహిస్తున్నారు. వీరంతా గోవాలో ఒకరికి ఒకరు తారసపడటంతో అంతా గందరగోళానికి గురైనట్లు తెలిసింది. చివరకు ఎవరూ ఎవరికి మద్దతు పలుకుతారనేది స్పష్టత లేకపోవడంతో అటు చైర్మన్, ఇటు అసమ్మతి ప్రధాన నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలావుండగా నేడు (గురువారం) ఉదయం 11 గంటలకు 13 మంది కౌన్సిలర్లు కలిసికట్టుగా కౌన్సిల్‌లో హాజరై బలనిరూపన జరిపితే తప్పా అవిశ్వాసం నెగ్గే అవకాశాలున్నాయి. లేదంటే యథాస్థితిలో పాలన కొనసాగడం ఖాయమని అధికారులు తెలిపారు.

మణికొండ మున్సిపల్ కార్యాలయం

ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ

మణికొండ, ఫిబ్రవరి 21 : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి లో బుధవారం ద్వాదశ జ్యోతిర్లింగాల శివస్వాముల మహాపడిపూజ మహోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. సురేశ్ గురుస్వామి, రాజన్ మహారాజ్ జ్యోతిర్లింగాల మహాపడిపూజ నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గొల్ల నాగేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప దంపతుల ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. జై శబరీశ్వర భజనమండలి ఆధ్వర్యంలో జంగిరెడ్డి గురుస్వామి భక్తిపాటలతో అలరింపజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, పార్టీ నాయకులు నర్సింహా, మాజీ ఉపసర్పంచ్ భగవాన్ సింగ్, శివస్వాములు పాల్గొన్నారు.

మహాపడిపూజలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, స్వాములు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ మున్సిపల్ నెక్నాంపూర్ చెరువు వద్ద అధికారులతో కలిసి పర్యటిస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ, ఫిబ్రవరి 21 : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రజల్లో ఉంటూ సేవలందించేందుకే అధికారులు పని చేస్తున్నారని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం అల్కాపూర్ టౌన్‌షిప్, నెక్నాంపూర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిప్రవళిక, 8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్‌లతో కలిసి ఆయా ప్రాంతాలను సందర్శించారు. నెక్నాంపూర్ గ్రామ సమీపంలోని చిన్నచెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కోరగా.. వెంటనే కమిషనర్ .. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఓ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెరువులో గుర్రపుడెక్కను తొలగించేవారని అందుకు అవసరమైన నిధులను మున్సిపాలిటీ వెచ్చించేదంటూ అధికారులు తెలుపడంతో సదరు నిర్వాహకులను పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. హుడా కాలనీలో కొందరు మున్సిపాలిటీకి చెందిన స్థలాలను కబ్జాలు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ అధికారులు త్వరలోనే దానిని స్వాధీనం చేసుకుంటారని ప్రజలకు హామీ ఇచ్చారు. అల్కాపూర్ టౌన్‌షిప్ సమీపంలో ఉన్న వంద అడుగుల రహదారి పక్కన వర్షపునీరు వెళ్లే రహదారిని కొందరు వ్యక్తులు మూసి వేస్తున్నారని గుర్తించి.. దానిపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారని కౌన్సిలర్ నవీన్‌కుమార్ తెలిపారు. మూడేండ్ల క్రితం రహదారి నిర్మాణం కోసం నిధులను మంజూరు చేసినా పట్టించుకోని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఇటీవలే మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌కుమార్ ప్రజా సమస్యలపై స్పందించి చర్యలకు ఉపక్రమించడంపై కౌన్సిలర్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్డీవో, తాసీల్దార్‌లకు సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 21: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్ అన్నారు. రాజేంద్రనగర్ ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డితోపాటు రాజేంద్రనగర్ తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రాములును బుధవారం సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు. అలాగే.. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాలరాజ్, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీధర్, మహమ్మద్ ఖాలేద్, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, సదానంద్, కుమార్ పాల్గొన్నారు.



నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో, తాసీల్దార్‌లను సన్మానిస్తున్న నాయకులు

విద్యార్థులకు హెల్మెట్ల పంపిణీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 : సోమాజిగూడ డివిజన్‌లోని హరిగేట్ ప్రభుత్వ పాఠశాలలో ది ఇండియన్ హెడ్ ఇంజూరీ ఫౌండేషన్, ఎస్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హీరో మోటో కార్ప్ సహకారంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్ విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ హెడ్ ఇంజూరీ ఫౌండేషన్ ప్రతినిధులు అనురాధ ప్రసాద్, మారుతీ ప్రసాద్, ఎస్ సేవ ఫౌండేషన్ అధినేత ఎంఏ బేగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అహ్మద్, శ్రీనివాస్ యాదవ్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సంగీత యాదవ్

ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట

మధురానగర్ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ స్రవంతిశ్రీకాంత్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు మధురానగర్ వార్డు కౌన్సిలర్ స్రవంతిశ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు మధురానగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు పనులు పూర్తి చేశామని ఎక్కడైన మిగిలి ఉంటే వాటిని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తాజాగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహకారంలో 23వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. వార్డులో తాగునీరు, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యురాలు కవితప్రసాద్, వార్డు అధ్యక్షుడు గోటూరి పవన్‌గౌడ్, సౌమ్య, జైహింద్‌రెడ్డి, నర్సింహాగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, ప్రభాకర్, వీరేశం, శ్రీశైలం,రాజు, ప్రభాకర్ రెడ్డి, గుంటి రవి పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు జి. రామన్‌గౌడ్ కోరారు. కామినేని దవాఖాన వారి ఆధ్వర్యంలో బుధవారం నారాయణగూడలోని మెల్కోటే పార్కు ఆవరణలో వాకర్స్‌కు ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. ఆయన దానిని ప్రారంభించారు. 185 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామినేని దవాఖాన వైద్యుడు అనురాగ్,పార్కు అధ్యక్షుడు భూషణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మహేశ్, జక్కి, అభిషేక్ రెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పద్మశాలి యువజన విభాగం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌కుమార్

గౌతమ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న స్వామి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి21: తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరాల గౌతమ్‌కుమార్ నియమితులైయ్యారు. ఈ మేరకు బుధవారం నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో గౌతమ్‌కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పద్మశాలి యువతను ఐక్యం చేసి ప్రభుత్వ పరంగా వచ్చే హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగజాతిపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష

జై భీం యూత్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): మాదిగ జాతిపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని జై భీం యూత్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు నడిమిదొడ్డి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామజికవర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, కేవలం పాలకుల పాలనే అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంపై పదే పదే ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. మాదిగ జాతిపై కాంగ్రెస్ చూపుతున్న వివక్షపై త్వరలో రాష్ట్రంలోని దళిత సంఘాలతో సమావేశమై ఐక్య కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పాతకక్షలతో దాడి.. అరెస్టు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 21: పాతకక్షలతో యువకుడిపై కత్తుతో దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్-3 ప్రాంతానికి చెందిన సయ్యద్ సమీర్‌కు, టోలీచౌకి ప్రాంతానికి చెందిన అయిమన్ పాషాకు గతంలో గొడవలున్నాయి. ఈ క్రమంలో బంజారాహిల్స్ రోడ్ నం.3లోని షౌకత్‌నగర్ లిటిల్ స్టార్ హైస్కూల్ సమీపంలో ఉంటున్న యూసుఫ్‌ను కలిసేందుకు పాషా, ఫారూఖ్ తో కలిసి వచ్చారు. అదే సమయంలో స్నేహితుడు సుభాన్‌తో కలిసి సమీర్ అక్కడకు వచ్చాడు. పాతకక్షల కారణంగా పరస్పరం దాడి చేసుకోగా.. తీవ్రగాయాలైన సమీర్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడు సమీర్ ఫిర్యాదుతో పాషా, ఫారూఖ్, సుభాన్‌లను రిమాండ్‌కు తరలించారు.

నెక్నాంపూర్‌లో సమ్మక్క, సారక్క జాతర..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌లో ఆనవాయితీగా వస్తున్న సమక్క, సారక్క జాతర బుధవారం మొదటి పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలు తమ గ్రామ దేవతలైన సమ్మక్క, సారలమ్మకు పూజలు చేశారు. వరంగల్‌లోని మేడారం జాతర జరిగే సమయంలోనే ప్రతియేటా ఇక్కడ జాతర జరుపుకుంటున్నారు. మొదటి భోనాలను అమ్మవార్లకు సమర్పించిన భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. - మణికొండ, ఫిబ్రవరి 21

యువజన సమ్మేళనానికి తరలిరండి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ 28న వరంగల్‌లో జరిగే యువజన సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ బుధవారం పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ యువతను మోసం చేశారని విమర్శించారు.

ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపు..

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నారు. రోడ్లపై వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో పాదచారులు రహదారులపై నడవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బుధవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పలు వ్యాపార దుకాణాలను తొలగించారు.

సమాజాన్ని చైతన్యపరిచిన వైతాళికుడు వట్టికోట

పాత్రికేయుడు వేణుగోపాల్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 21: తెలంగాణ ప్రజా సాహిత్యకులు, గ్రంథాలయోద్యమ నాయకుడు, ఉద్యమకర్త వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో స్మారకోపన్యాసం నిర్వహించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎన్.వేణుగోపాల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 'వట్టికోట ఆళ్వార్‌స్వామి- గ్రంథాలయోద్యమం' అనే అంశంపై ప్రసంగిస్తూ .. తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని ఉవ్వెత్తున నడిపిన వైతాళికుడిగా పేరుపొందిన వట్టికోట సమాజంలో చైతన్యం నింపారన్నారు. భూస్వాముల పెత్తనం కింద నలిగిపోతున్న తెలంగాణను విముక్తిచేయడం సామాజిక బాధ్యతగా గుర్తించారని, అనేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయించి మారుమూల ప్రాంతాల్లో సైతం అభ్యుదయ కిరణాలు వ్యాపింపజేశారని పేర్కొన్నారు. తెలంగాణ యాసకు తన రచనల్లో పెద్దపీట వేశారని, ఆయన రచనలు నేటి తెలంగాణకు దిశా నిర్దేశం చేసేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.సీతారామారావు, రిజిస్ట్రార్ ప్రొ.ఏవీఆర్ఎన్.రెడ్డి, లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజినిపాల్గొన్నారు.

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వట్టికోట ఆళ్వార్‌స్వామి స్మారకోపన్యాసంలో పాల్గొన్న జర్నలిస్ట్ వేణుగోపాల్

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: రోడ్డు దాటుతున్న ఓ పాదచారుడిని ఆటో ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నారాయణగూడ పీఎస్ పరిదిలో చోటు చేసుకున్నది. అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట్‌లో నివాసం ఉండే యండి.ఖతీబ్ హిమాయత్‌నగర్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం లిబర్టీ చౌరస్తాలో రోడ్డు దాటుతున్న క్రమంలో మల్కాజిగిరికి చెందిన సుమన్ ఆటోతో వేగంగా వచ్చి ఖతీబ్‌ను ఢీకొట్టగా అతను కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం కింగ్‌కోఠి దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించగా ఖతీబ్ మెదడుకు కొంతవాపు వచ్చి రక్తంగడ్డ కట్టినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం జూబ్లీహిల్స్ అపోలో దవాఖానకు తరలించారు. బుధవారం ఖతీబ్ కుమారుడు యండీ రజాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ఈ ఘటనకు బాధ్యుడైన సుమన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

పెండింగ్‌లో అభివృద్ధి పనులు..!

యూసుఫ్‌గూడలో రూ.2.5 కోట్లపైన పనులు టెండర్లు రద్దు చేసుకుంటున్న కాంట్రాక్టర్లు..!

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 21: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పలు అభివృద్ధి పనులు ముందుకు పడేలా కనబడడంలేదు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో వర్షాలకు గుంతలు పడ్డ రోడ్ల అభివృద్ధి, ఇతర పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ఇంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వాలు మారడంతో అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతంలో చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కొత్త పనులకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రూ.2.5 కోట్ల వ్యయంతో సుమారు 10 అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే గతంలో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కొత్త పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడంలేదు. ఫలితంగా పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లోనే ఉండేలా ఉన్నాయి. అయితే మార్చినెలతో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఈ అభివృద్ధి పనుల అంశం ఒక కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. పాత బిల్లులు మంజూరు కాకపోవడంతో కొత్త పనులకు వేసిన టెండర్లను రద్దు చేసుకుంటున్నామని కాంట్రాక్టర్లు తెలిపారు.

తప్పని తిప్పలు..

కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో వాహనదారులకు గుంతల రోడ్లతో తిప్పలు తప్పేలా లేవు. గతంలో కురిసిన వర్షాలతో గుంతలు పడ్డ రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులతో పాటు పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేసేందుకు అధికారులు సంకల్పించినా అది కార్యరూపం దాల్చలేదు. ఇకనైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్లకు పాత బిల్లులు చెల్లించి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.